www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 09 | మే | 2025
పేజీలు 8

## గాలివాన బీభత్సం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎర్రుపాలెం మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన గాలివానకు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న లు పూర్తిగా తడిసిపోయాయి. ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ఈదురు గాలులకు ఎర్రుపాలెం జమలాపురం రోడ్డుపై పెద్ద పెద్ద వృక్షాలు నేలకూలాయి. ఐదు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్లు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

# మానవ వనరుల అభివృద్ధికి పటిష్ట చర్యలు






-వైద్యానికి యేటా రూ. 11,482 కోట్ల ఖర్చు
-అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా
-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
-మెడికల్ కళాశాల భవన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, రాజనర్సింహ

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో మానవ వనరుల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. వైద్యానికి ప్రతి యేటా రూ.11,482 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన తెలిపారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహా లతో కలిసి ఖమ్మంజిల్లా రఘునాథపాలెం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.130 కోట్లతో కళాశాల భవనాలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టివిక్రమార్క మాట్లాడుతూ వైద్య కళాశాల భవనాలకు శంకుస్థాపన జరగడం శుభ పరిణామమన్నారు. భవన నిర్మాణం పూర్తయితే మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం అందుతుందన్నారు. రాష్ట్రంలో ఎనిమిది వైద్య కళాశాలలను మంజూరు చేయించుకోవడం జరిగిందని గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు నిధులు అధికంగా ఖర్చు చేస్తుందన్నారు. 2014 నుంచి 2024 వరకు వైద్య రంగంపై రూ. 5959 కోట్లు ఖర్చు చేస్తే 2024 25 ఆర్థిక సంవత్సరంలో రూ.11,482 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని

మిగతా 2లో..

# సరిహద్దుల్లో ఉద్రిక్తత



- రక్తసిక్తమవుతున్న అడవులు
- ములుగు జిల్లా సరిహద్దుల్లో ప్రెసర్ బాంబు పేల్చిన మావోయిస్టులు
- ముగ్గురు జవాన్లు మృతి
- కర్రెగుట్టల పొడువునా కూంబింగ్
- అలుముకున్న యుద్ధమేఘాలు
- బిక్కుబిక్కుమంటున్న అటవీ గ్రామాలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణఛత్తీస్‌గడ్ సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పచ్చని అడవుల్లో నెత్తుటేరులు పారుతున్నాయి.తాజాగా గురువారం తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఎలిమిడి సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్ బలగాలపై మావోయిస్టులు మందు పాతర పేల్చారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందగా మరి కొంతమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతులతో పాటు క్షతగ్రాతులను వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి

మిగతా 2లో..

## ఉగ్రవాదం
# దేశానికి పెను ప్రమాదం



-పెరుగుతున్న ఆర్థిక అంతరాలు
-కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదు
-ఈర్లపుడి సభలో కూనంనేని

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉగ్రవాదం దేశానికి ప్రమాదమని అది ఏ రూపంలో ఉన్న ఉగ్రవాదాన్ని తుద ముట్టించాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉగ్రవాదంపై పోరుకు భారత కమ్యూనిస్టు పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే కాకుండా కవ్వింపు చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాల్లో భాగంగా గురువారం రఘునాథపాలెం మండల పరిధిలోని ఈర్లపుడిలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అరుణ పతాకాన్ని

మిగతా 2లో..

# మానవ వనరుల అభివృద్ధికి పటిష్ట చర్యాలు

(మొదటిపేజీ తరువాయి)

విక్రమార్క తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచడం జరిగిందని తద్వారా 90 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందన్నారు. వైద్యంతో పాటు విద్యకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచడం జరిగిందని తెలిపారు. 58 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను మంజూరు చేసి రూ. 11,600 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రైతులకు రుణమాఫీ ద్వారా రూ. 22వేల కోట్లు అందించామన్నారు. ఫాంహౌజ్‌లో పడుకున్న వారు చేసే విమర్శలు, ప్రేలాపనలను తాము పట్టించుకోబోమన్నారు. ఏడువేల కోట్ల రూపాయలు అప్పులు చేసిన వారు ఈ రాష్ట్రానికి ఏమి చేయకపోగా ఒకటిన కనీసం వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల అవసరాలను తీర్చడంలో తాము ముందు వరుసలో ఉన్నామని ఆయన తెలిపారు. ఉద్యోగులకు 15వ తేదీ తర్వాత వేతనాలు ఇచ్చిన వారు ఏనాడు సంక్షేమం గురించి పట్టించుకోని వారు ఇప్పుడు అనవసర విమర్శలు చేస్తున్నారని భట్టివిక్రమార్క తెలిపారు. ప్రజల కోసమే పాలన చేస్తున్నాం తప్ప దొరల కోసం పనిచేసే ప్రభుత్వం కాదని ఆయన తెలిపారు. అనవసరమైన విమర్శలు చేసే వారికి మా ప్రభుత్వం చేతలే సమాధానం చెబుతాయన్నారు. కోరి కోట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్న వారి ఆశలను గత ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఉద్యోగుల అవసరాలను తీర్చడంలో ముందుంటామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను కొందరు వక్రీకరించారని భట్టివిక్రమార్క తెలిపారు. సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఇతరత్రా కారణాలతో వైద్య కళాశాల భవన శంకుస్థాపన కార్యక్రమం వాయిదాపడిందని నేడు ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని విద్య, వైద్యానికి ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు అవుతుందని నర్సింగ్ కళాశాలను కూడా మంజూరు చేయాలని తుమ్మల కోరారు. మెడికల్ కళాశాల పక్కనే నాగపూర్ అమరావతి హైవే వస్తుందన ఏడాది కాలంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రింగు రోడ్డు పక్కన వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వంలో వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉండగా వాటిని చెల్లిస్తూ వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, మౌలిక వసతుల కల్పన చేయడం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో ఆరు పిహెచ్‌సిలను మంజూరు చేస్తామన్నారు. హైదరాబాద్ పై ఆధార పడకుండా ఖమ్మం, కరీంనగర్‌ను మెడికల్ హాబ్‌గా తయారు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివాసీల వైద్యం కోసం అంబులెన్స్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఖమ్మంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు మిడ్ వైపరీ కోర్సులను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఎంఎల్‌ఎలు రాందాస్ నాయక్, రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్ నరేంద్రకుమార్, ఫణీందర్ రెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి ఛైర్మన్ వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జెడ్పిసిఈవో దీక్షారైనా తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదం దేశానికి పెను ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)



సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుందన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గడిచిన రెండు దశాబ్దాలలో సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగగా దారిద్ర్యారేఖకు దిగువన జీవించే వారి సంఖ్య క్రమేపి పెరుగుతూ వచ్చిందన్నారు. కుటుంబ అవసరాలకు కనీసం ఖర్చు చేయలేని ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాల సంఖ్య పెరగడం ఇబ్బందికరమన్నారు. మతం మాటున కర్మ సిద్ధాంతాన్ని తీసుకు వస్తున్నారని ఇది ప్రమాదకరమని సాంబశివరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అదే పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సైతం పరిగణలోకి తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రపంచంలో కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం మరో సిద్ధాంతం లేదని ఆయన తెలిపారు. వందేళ్ల సుదీర్ఘ పోరాటంలో అనేక విజయాలను సాధించడం జరిగిందని పేదల పక్షాన నిరంతరం నికరంగా పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనన్నారు. స్వాతంత్ర్య సమరంలోనూ సాయుధ తెలంగాణ పోరాటంలోనూ భారత కమ్యూనిస్టు పార్టీ విరోచిత పాత్ర పోషించిందని నాటి పోరాట ఘట్టాలను నేటి తరాలకు తెలియజేసేందుకు శత వసంత సభలను నిర్వహిస్తున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీ లేకుంటే హక్కులు సాధించబడేవి కావని యువజన విద్యార్థి కార్మిక, కర్షక, మహిళా హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎర్ర జెండా నిరంతరం పోరాడుతుందన్నారు. సమాజాన్ని మార్చేది, మార్చగలిగేది ఎర్ర జెండా మాత్రమేనని కూనంనేని తెలిపారు. ఎన్నికలు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ క్రమంలో ఒక భాగం మాత్రమేనని ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించగా రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర్లు, అజ్మీర రామ్మూర్తి, పగడాల మల్లేష్, నాయకులు వరద నర్సింహారావు, బాగం ప్రసాద్, వెంకయ్య, బానోత్ రవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో ఉద్రిక్తత





(మొదటిపేజీ తరువాయి)

తరలించారు. ఇదే ప్రాంతంలో ఇరు వర్గాల నడుమ ఎదురుకాల్పులు సైతం చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో రూ.1 కోటి రివార్డు ఉన్న మావోయిస్టు నేత చంద్రన్నతో పాటు బండి ప్రకాష్ అనే మరో మావోయిస్టు మృతి చెందినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. గత 18 రోజులుగా ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టలను చుట్టుముట్టిన సంయుక్త 20వేలకు పైగా భద్రతా బలగాలు ఆ గుట్టలను తమ ఆదీనంలోనికి తీసుకున్నాయి. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులను ముట్టు పెట్టాయి. మావోయిస్టుల స్థావరాలను కనిపెట్టి యుద్ధతంత్రాలతో ముందుకు దూసుకుపోతున్న బలగాలు పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ముందుకు సాగుతున్నాయి.

### కర్రెగుట్టల పొడవునా కూంబింగ్ ...

వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టులను అంతంచేస్తామని కేంద్రమంత్రి అమీత్‌షా ప్రకటించిన నేపథ్యంలో గత 18 రోజులుగా కర్రెగుట్టలల్లో భద్రతా బలగాలు మకాం వేసి, అనువునా సోదాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే 20 వేల మందికి పైగా బలగాలను మోహరించిన ప్రభుత్వాలు అధునాతన ఆయుధసంపత్తితో తూటాల వర్షం కురిపిస్తున్నట్లు చెబుతున్నారు. తాము శాంతి చర్చలకు సిద్ధమే అంటూ మావోయిస్టు పార్టీ పలుమార్లు లేఖలు పంపినప్పటికీ ప్రభుత్వాలు తోసిపుచ్చాయి. కయ్యానికి కాలుదువ్వుతున్నట్లు కేంద్రం, ఇటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ తీరు ఉండటంతోయుద్ధవాతావరణం నెలకొంది. కర్రెగుట్టల ఎన్‌కౌంటర్ జరిగిన ఒక్కరోజు గడవక ముందే మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో పరిస్థితులు మరింత భయానకంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర నుండి పెద్ద ఎత్తున బలగాలను సమీప అడవుల్లో మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. చర్ల ప్రాంతంలో ఉన్న సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ల నుండి కూడా జవాన్లను పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టులు ఉన్నరాని తేలిపోవడంతో గాలింపు చర్యలు ముమ్మరమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమీప అటవీ గ్రామాల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో అంతుపట్టక సమీప అటవీ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలంవెల్లదీస్తున్నారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాన్ని తమ ఆదీనంలోనికి తీసుకున్న బలగాలు అడుగడుగునా సోదాలు మొదలుపెట్టారు. వాహనాల తనిఖీలతో పాటు అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలోనికి మావోయిస్టులు చొరబడుతున్నారనే వార్తల నేపథ్యంలో నేడు చోటు చేసుకున్న ఘటనతో మావోయిస్టు పార్టీ ఈ ప్రాంతంలో బలంగానే ఉన్నట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. అడవుల్లో నుండి ప్రధాన రహదార్లకు చేరుకునే అటవీ మార్గాలను, గోదావరి ఫెర్రీ పాయిట్ల వద్ద నిఘా పెంచారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న యుద్ధ వాతావరణం అటు భద్రతాబలగాలు, మావోయిస్టులతో పాటు ఇటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

# కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో 44 మందికి మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారఖ్ చెక్కులను చింతకాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మొత్తం 44 లబ్ధిదారులకు 44.5లక్షల చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు కూరపాటి కిషోర్, గోపీ , ఆత్మ కమిటీ డైరక్టర్లు కొప్పుల గోవిందరావు, సట్టు వెంకటేశ్వర్లు, టీడీపీనాయకులు తేలుకుంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మిట్టపల్లికి కేటీఆర్



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. డిసిఎంఎస్ అధ్యక్షులు దివంగత బిఆర్ఎస్ నేత రాయల వెంకటశేషగిరిరావు విగ్రహా విష్కరణలో పాల్గొననున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి హెలికాప్టర్ ద్వారా రేజర్ల చేరుకుంటారు. రేజర్ల నుంచి రోడ్డు మార్గం ద్వారా మిట్టపల్లి చేరుకుని విగ్రహావిష్కరణలో పాల్గొంటారు. ఆ తర్వాత మిట్టపల్లి వద్ద జరిగే బిఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకుంటారు.

# ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల జారీ చేసిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల నేపథ్యంలో గురువారం ఎస్‌హెచ్‌వోలు ఖమ్మం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ టి. కరుణాకర్, ఖమ్మం త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి. రమేష్ లు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లకు పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేశారు.



# వైరా ఏసిపిగా సారంగపాణి

**ప్రజాపక్షం/ఖమ్మం :** వైరా ఏసిపిగా సారంగపాణి ని నియమిస్తూ పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వైరా ఏసిపిగా పని చేస్తున్న రెహ్మాన్ తెలంగాణ డిజిపి ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. సారంగపాణి ఖమ్మం జిల్లాలో వివిధ హోదాలలో పలు ప్రాంతాల్లో పని చేశారు.



# ఆసుపత్రి అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సమర్పించాలి

**-డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**
**-ప్రభుత్వ ఆసుపత్రులకు బ్రాండింగ్ కల్పించాలి**
**-వైద్యశాఖపై సమీక్ష నిర్వహించిన డిప్యూటీ సిఎం భట్టి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఆసుపత్రి అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సమర్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి, వైరా ఎంఎల్ఏలు రాగమయి, రాందాస్ నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ వైద్య శాఖ పనితీరును జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రికి అవసరమైన ప్రతిపాదనలు వైద్య కళాశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చేయాల్సిన ఏర్పాట్ల ప్రతిపాదనలను పూర్తి స్థాయిలో తయారు చేసి సమర్పించాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో జనాభా ఆధారంగా అవసరమైన నూతన పిహెచ్‌సి, సబ్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ఆసుపత్రి భవనాలు, కూలిపోయే స్థితిలో ఉన్న పిహెచ్‌సి, సబ్ సెంటర్ల ప్రతిపాదనలను అందించాలన్నారు. అప్‌గ్రేడ్ చేసిన ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. షెడ్యూల్ ట్రైబ్ ఏరియాల్లో రెండు అంబులెన్స్ సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. సబ్ సెంటర్ నుంచి పిహెచ్‌సికి ఎంత సమయంలో చేరుకుంటామో పరిశీలించి నివేదిక అందిస్తే దాని ప్రకారం అంబులెన్స్‌లను మంజూరు చేస్తామన్నారు. మొబైల్ ఎన్‌సిడి సెంటర్లను మంజూరు చేస్తామని, సీజనల్ వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం వైద్య కళాశాలలో ఉన్న 100 సీట్లను 150 వరకు పెంచుకునేందుకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని 600 పడకల విస్తరణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనరల్ ఆసుపత్రి వద్ద అందుబాటులో ఉన్న స్థలం



ఆసుపత్రి ఓపి, ఐపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాల విద్యార్థిని, విద్యార్థులతో మంత్రి చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చేసిన సమీక్ష అనుగుణంగా నివేదికలు పంపాలన్నారు. వైద్యశాఖ మరింత సమర్థవంతంగా పని చేయాలని, పేద ప్రజలకు మరింత వైద్య సేవలను అందించాలని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద అదనపు ఫ్లోర్ నిర్మాణానికి రూ. 12 కోట్లు, టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి కోటి రూపాయల అంచనాతో ప్రతిపాదనలు సమర్పించామన్నారు. వైద్య కళాశాల వద్ద బాయ్స్ హాస్టల్, కాంపౌండ్ వాల్, అంతర్గత రోడ్లు, రెండు బస్సులు, రెండు 108 సర్వీసులు, నాలుగు పిహెచ్‌సిల వద్ద 102 సర్వీసుల అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. 12 సబ్ సెంటర్ల భవనాల పునర్ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఖమ్మంజిల్లాలో ఎంపిహెచ్‌ఏ (ఎం)లు రేడియాలజిస్టు, ఫార్మాసిస్టు, గైనకాలజిస్టు అవసరం ఉందన్నారు. ఖమ్మంజిల్లాలో నూతన బస్తీ దవాఖానా అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపి సునీల్ దత్, రాష్ట్ర హస్తకళల సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, డిఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రంసింగ్, జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ, రెవెన్యూ డివిజనల్ అధికారులు నర్సింహారావు, రాజేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కళావతిబాయి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కూనంనేని





**ప్రజాపక్షం/ఖమ్మం:** బస్వాపురం మాజీ ఎంపీటీసీ మార్గం కొరివీ రమ్మ శ్రీనివాసరావు దంపతుల కుమారుడు వేణుఅఖిల దంపతుల వివాహానికి గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై నూతన వధూవరులను ఆశిర్వధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి , కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జునరావు, వ్యకాస జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు , జిల్లా సమితి సభ్యులు కూచిపుడి రవి, తాటి నిర్మల, రాసాల మోహన్‌రావు, దూసరి గోపాలరావు , అబ్బూరి మహేష్, దొబ్బల వెంగళరావు, కొల్లి రవి, మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ, బొడ్డు కొండలరావు, ఆవుల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బస్వాపురం గ్రామానికి చెందిన సీపీఐ కార్యకర్తలు మామిడాల యాలాద్రి, చేబోలు రవి కి ఇటీవల యాక్సిడెంట్ అవ్వగా వారిని పరామర్శించి త్వరలో కొలుకోవాలని ఆకాంక్షించారు.

# ముత్తయ్యకు ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు చుండూరు ముత్త య్య ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విష యం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి.. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబంశివరావు గురువారం నివాసకం వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆరో గ్య పరిస్థితని ఆయన మేనల్లుడు, సిపిఐ పాలేరు నియోజకవర్గ నాయకుడు లింగ వెంకటనారాయణను అడిగి తెలుసుకున్నారు. అలాగే సత్యనారాయణపురంలోని టిసివిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండల సమితి సభ్యుడు గూడా బాబురెడ్డి కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని నూతనవధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, పలువురు సిపిఐ నేతలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు





**యువతిని కారులో హాస్పిటల్‌కు తీసుకెళ్లిన ఆర్ఐ**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ బాలాజి నగర్ వద్ద ఉదయం లారీ ఢీకొని యువతకి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఖమ్మం మున్సిపాల్ కార్పొరేషన్‌లో పనిచేసే ఖమ్మం కవిరాజ్ నగర్‌కు చెందిన అడపా భవాని వైరా మండలం గన్నవరం గ్రామంలో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అదే సమయంలో ఖమ్మం రూరల్ రెవెన్యూ ఆర్ఐ ప్రసాద్ తన స్నేహితులతో కలిసి వెళుతుండగా రోడ్డు ప్రక్కన రక్తపు మరకలతో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న కడప భవానిని తన కారులో ఎక్కించుకొని వైరా ప్రభు త్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్క దున్న స్టాఫ్ నర్స్ వైద్యం అందించి ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. ప్రమాదం విషయాన్ని ప్రసాద్ వైరా తహాశీల్దార్‌కి తెలియజేయగా స్పం దించి వెంటనే మెడికల్ ఆఫీసర్‌ను అక్కడికి వచ్చి పరిస్థితిని గమనించి ఆమెని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం గాని, హైదరాబాద్ గాని తీసుకెళ్లాలని సూచించారు. ఈ ప్రమాదం చూసిన వెంటనే 100కు, 108కు దయల్ చేయగా వారు గంటకు పైగా స్పందించలేదు. ఆర్ఐ ప్రసాద్ ఈ గాయపడినటువంటి యువతి యొక్క బ్యాగులో ఐడెంటి కార్డును గుర్తించి యువతి ఖమ్మం మున్సిపాల్ కార్పొరేషన్‌లో పనిచేస్తుందని గమనించి వెంటనే విషయాన్ని ఖమ్మం మున్సిపాల్ కమీషనర్ సిసి పవన్‌కి తెలియజేశారు. స్పందించి సిసి విషయాన్ని వారి బంధువులకు తెలియజేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సిపిఎస్‌లో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని సిపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రైసింగ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని ఎంఇఓ వై.ప్రభాకర్ ప్రారంభించారు. ఈస oదర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రైసింగ్ కార్యక్రమంలో భాగంగా డ్రాయింగ్, క్యారం బోర్డ్, వాలీబాల్, డ్యాన్స్ తదితర అంశాల్లో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై భారతసైన్యం చేసిన ఆపరేషన్ సింధూర్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నభీ పేర్కొన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని స్థానిక కార్యాలయంలో తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన గురువారం ఏర్పాటైన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మోధీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తూ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు రైతు వ్యవసాయ కార్మికులు గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయని, ప్రతీ ఒక్కరూ ప్రత్యక్షంగా పాల్గొనాలని,ఇది చారిత్రాత్మక సమ్మె అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు మన్యం మోహన్‌రావు, సుల్తానా, ఆలేటి కిరణ్,, ఆలేటి సంధ్య, షేక్ ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, కొడెం బోస్, మహమూద్, సత్యనారాయణ కోరి, సంతోశ్, వాసం మాధవి,సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని దెందుకూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్యామలారావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే భోదన, విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల బట్టలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్కాలర్ షిప్ తదితర సదుపాయలు ఉంటాయని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సునీత,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 31వ తేదీ వరకు అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పెంపు



**ప్రజాపక్షం/ మధిర :** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2, 4, 6 సెమిస్టర్ల పరీక్ష ఫీజు గడువు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు మధిర స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ శీలం ఇందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజును దగ్గరలోని మీసేవా లేదా టిఎస్ ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ స్టడీ సెంటర్, 9666366833, 7382929694నెంబర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

## ముమ్మరంగా రైతు సదస్సులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనంతారం, మద్దికొండ గ్రామాల్లో గురువారం రైతు సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ పరీక్ష, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, నీటిని ఆదా చేయడం, చెట్లను పెంచడం, రసీదులను భద్రపర్చటం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా రైతులు రసాయన ఎరువులు, యూరియా వాడకాన్ని తగ్గించాలని, పచ్చిరొట్టెల ఎరువులు వేసుకోవాలని సూచించారు. అలాగే వాణిజ్య పంటలైన కూరగాయలు, మునగ, ఆయిల్ తోటలను క్షేత్రస్థాయిలో సందర్శించి సాగు విధానం, మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ హేమంత్‌కుమార్, వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు కె.రవి కుమార్, వ్యవసాయకళాశాల ఆచార్యులు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ నీలిమ, కళాశాల విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తల్లాడ మండలానికి కేటిఆర్

### రాయల శేషగిరిరావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్న కేటిఆర్

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి నేడు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్ రానున్నారు. మిట్టపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన డిసిఎంఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ రాయల శేషగిరిరావు విగ్రహాన్ని కేటిఆర్ ఆవిష్కరించనున్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తల్లాడ మండల నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ విగ్ర ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రానున్న నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో నూతనుత్తేజం నింపనున్నారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తదితరు బిఆర్ఎస్ నాయకులు పాల్గొనున్నారు.

## ఖమ్మంరూరల్ ఆర్ఐ ప్రసాద్ ఔదార్యం

**- ప్రమాదంలో గాయపడిన ఓ యువతిని తన కారులో ఆస్పత్రికి తరలింపు**

**- అత్యవసర సమయంలో స్పందించని 108 అంబులెన్స్ విభాగం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంరూరల్ మండలం రెవిన్యూ ఆర్ఐ ప్రసాద్ తన ఓదార్యాన్ని చాటుకున్నాడు. ఓ యువతి రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. తన కారులో స్నేహితులతో కలిసి ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని మేల్కొలిపాడు.వివరాల్లోకి వెళితే... రెవిన్యూ ఆర్ఐ1 ప్రసాద్ గురువారం ఖమ్మం నుంచి సత్తుపల్లి తన స్నేహితులతో కలిసి వెలుతున్నారు. ఈ క్రమంలో ఉదయం 7గంటల సమయంలో వైరా నగర శివారులోని డివైడర్ దగ్గర ఓ యువతి ద్విచక్రవాహనంపై నుంచి ఆగివున్న లారీని వెనుకనుండి ఢీకొని తలకు బలమైన గాయం తగిలి తీవ్ర రక్తస్రావంతో రోడ్డు పక్కన ప్రమాదకర పరిస్థితుల్లో పడిఉంది. గమనించిన ఆయన సదరు యువతిని హూటాహుటీన వైరా ప్రభుత్వ ఆస్పత్రికి తన కారులో తీసుకువెళ్లారు. అలాగే ఆ యువతి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారాన్ని సైతం అందించారు. ఈ ప్రమాదంపై అత్యవసరవిభాగమైన 108ను సంప్రదించినప్పటికీ అందుబాటులో రాలేదు. కాగా సదరు యువతి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి అడప భవానిగా ఐడెంటికార్డ్ ద్వారా గుర్తించారు. ఈ దాతృత్వ ఘటనతో మానవత్వం పరిమళించేది.

## పెనుబల్లి సీహెచ్‌సికి ఆరు సోలార్ లైట్లు



**ప్రజాపక్షం/ఖమ్మం :** సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచనల మేరకు సింగరేణి యాజమాన్యం, ప్రాజెక్టు ఆఫీసర్ జె.వి.ఆర్.ఓ.సి సత్తుపల్లి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్ వెంటనే స్పందించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పెనుబల్లికి ఆరు సోలార్ లైట్లు అందజేశారు. గిరిజన హాస్పిటల్ అయిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పెనుబల్లికి సింగరేణి యాజమాన్యం వారు అందించిన సహాయ సహకారాలకు హాస్పటల్ సిబ్బంది, వైద్యాధికారి ఎన్ కిరణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

# అకాల వర్షంతో అన్నదాతలు ఆగమాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** సుజాతనగర్ మండలంలో యాసంగి పంటలు వేసిన రైతులు కొనుగోలు కేంద్రాలలో తూర్పాలు పట్టి తేమ శాతం వచ్చిన కాంటాలు పెట్టక కొనుగోలు జరగక ఎదురుచూస్తున్న రైతులను అకాల వర్షం వచ్చి నిండా ముంచింది. గురువారం సాయంత్రం వేళలో ఈదురు గాలులతో వర్షం బీభత్సం సృష్టించింది. అందిన కాడికి అప్పులు తెచ్చి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలను కోసి ఆరబెట్టిన తర్వాత అకాల వర్షాలు రావడంతో టార్పాలిన్ పట్టాలు లేక, రైతులకు పట్టాలు కొనే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం భారీగా రావడంతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడుస్తావుంటే రైతులు కన్నీరు పర్యాంతమవుతున్నారు. ఇంకా ఒక పక్క హార్వెస్టర్ యంత్రాల ద్వారా వరి కోతలు జరుగుతున్నాయి. మొక్కజొన్న, మిర్చి రైతులు చేతికి వచ్చిన పంట వర్షానికి పంట నష్టం జరుగుతుంటే రైతులు గుండె తరుక్కుపోతుంది. మిర్చి రైతులు వేసినప్పటి నుంచి ముడత ఎర్రనల్లి తో వివిధ కంపెనీల మందులు పిచికారి చేసి వేల రూపాయలను పెట్టుబడి పెట్టారు. పంటను అమ్మకానికి పోతే రైతుకు గిట్టుబాటు ధర లేక కోసిన కూలీల ఖర్చు రాక మిర్చి రైతులు వాపోతున్నారు. ఇటీవల రైతులు తమ ధాన్యాన్ని త్వరగా కాంటాలు పెట్టి కొనుగోలు చేయాలని నిరసన తెలియజేశారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రైతుల బాధలు తీర్చాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి స్కిల్ మాట్రిక్స్ అమలు చెయ్యండి



**ప్రజాపక్షం/ఖమ్మం :** అర్హులైన ప్రతి ఒక్కరికి స్కిల్ మాట్రిక్స్ అమలు చేయాలని ఐటిసి ఏఐటియూసి గౌరవ అధ్యక్షులు సింగమనేని ప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలో గల ఐటిసి పరిశ్రమలో ఏఐటియూసి గౌరవ అధ్యక్షులు సింగమనేని ప్రసాద్, గౌరవ సలహాదారులు తన్నీరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి షేక్ జహూర్‌ల ఆధ్వర్యంలో రెండో విడత గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ మాట్రిక్ అమల్లో అనేక అవకతవకలు జరిగాయని, చాలా మంది అర్హులైన వారికి స్కిల్ మాట్రిక్స్ అందని ద్రాక్షల మారిందన్నారు. యాజమాన్యం అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరారు. కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం ఇస్తే ప్రొడక్షన్ తీసే దానిలో మరింత భాగస్వాములు అవుతారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్మికుల శ్రమలో నుండి పుట్టిందని వారు పడుతున్న శ్రమకు యాజమాన్యం గుర్తించక తప్పదని లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కే వరకు ఎర్రజెండా నీడన పోరాడుతామని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటియూసి కాంట్రాక్ట్ వర్కర్స్ అధ్యక్షులు బల్లం నాగయ్య, ఉపాధ్యక్షులు కోటమర్తి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు ఉపేందర్, గౌతమ్, షేక్ సద్దాం, తోకల నాగరాజు, మహిళా నాయకురాలు లక్ష్మీ, అనసూయ, రాజేశ్వరి, పిచ్చమ్మ, నాగరాజు, మోహన్‌రావు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు అదనంగా మూడు ఏసీ బస్సులు

**డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి డిపో నుండి ప్రతి రోజు అదనంగా మూడు రాజధాని ఏసీ బస్సులు హైదరాబాద్ కు పగలు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ డిప్యూటీ ఆర్ఎం. మల్లయ్య తెలిపారు. గురువారం కల్లూరు విఎం బంజర, సత్తుపల్లి, మందలపల్లి, అశ్వారావుపేట బస్టాండ్‌లను ఖమ్మం రీజినల్ డిప్యూటీ ఆర్ఎం. మల్లయ్య తనిఖీ చేశారు. అనంతరం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం వేసవిలో పగలు కూడా ఏసీ బస్సులు నడపాలనే సంకల్పంతో మూడు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్తుపల్లి నుండి ఉదయం 10 గంటలకు రాజధాని ఏసి బిహెచ్ఇఎల్ వరకు, అదే విధంగా 11:30 గంటలకు సత్తుపల్లి నుండి ఎంజీబీఎస్ కు రాజధాని ఏసి, మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు ఎంజీబీఎస్ రాజధాని ఏసీలు నడుపుతున్నట్లు ఆయన వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యార్ధం అన్ని బస్టాండ్ లలో చల్లని మంచినీరు అందించేందుకు వాటర్ ఫ్రిజ్ లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అన్నపురెడ్డిపల్లి, పాల్వంచ, కొత్తగూడెం ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా ఒక షెడ్డు ని ఏర్పాటు చేసి, ఫ్లాట్ ఫామ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, అసిస్టెంట్ మేనేజర్ పి. విజయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఇసుక మాఫియాని అరికట్టాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి, పర్యావరణాన్ని దెబ్బతీసే ఇసుక మాఫియాను అరికట్టాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమాలు అరికట్టకపోతే కలిసివచ్చే అందరిని కలుపుకొని ఆందోళన నిర్వహిస్తాం అన్నారు. ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని కఠిన చర్యలతోటే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వ ఆదాయం పెంచవచ్చని 132025 తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన గనుల శాఖ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడం, ఇది మంచి విషయమే కానీ క్షేత్రస్థాయిలో పినపాక నియోజకవర్గం లో ఇసుక దోపిడీకి అవధులు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో గోదావరి ఆదిలాబాద్ జిల్లా నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరకు 1465 కిలోమీటర్ల తీరం ఉందని, ఇది సహజ వనరుల్లో ఒకటని, ఇది మంచి విషయమే అని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కానీ ఇసుక అక్రమ తవ్వకాల వల్ల తీరని నష్టం జరుగుతుందన్నారు. సొసైటీల పేరిట బినామీ కాంట్రాక్టర్లు గోదావరి తీరంలో ఇష్టా రీతిన వ్యవహరిస్తూ, అక్రమ పద్ధతులు అనుసరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, సొసైటీ సభ్యులను నష్టపరుస్తూ వారు మాత్రం కోట్లు గడిస్తున్నారు అన్నారు. వీరు వాస్తవానికి 3.5 మీటర్లు మేటలనే తీయాలి కానీ హద్దు పద్దు లేకుండా తీస్తున్నారు. వీరు తవ్వుకోవడం, అమ్ముకోవడం అనే విధ్వంసకర విధానంతో ప్రకృతి విపత్తులకు కారణమవుతున్నారు అని అన్నారు. అక్రమ పద్ధతుల వల్ల, లైసెన్స్ ఉందనే పేరిట చట్ట విరుద్ధంగా వారు పొందిన అనుమతులు దాటి తోడుకుంటున్నారన్నారు. పెద్ద గోతులు పడుతున్నాయన్నారు. ఇసుక అక్రమ తోలకాలవల్ల కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి యాసంగి పంటలకు పెనుముప్పుగా తయారవుతుందన్నారు. మిషన్ భగీరథ లాంటి పథకాలతో త్రాగునీటి అవసరాలను తీర్చుకునేది కూడా గోదావరి జలాల తోటే అన్నారు. అందుకే నదులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత యావత్ ప్రజానీకంపై ఉందన్నారు. ఈ ఇసుక అక్రమ తవ్వకాలను నివారించాలంటే, సహజ వనరులను రక్షించుకోవాలంటే ప్రభుత్వమే ఇసుక తవ్వకాలను జరపాలన్నారు. ఈ ఇసుక అక్రమ తవ్వకాల వల్ల జరిగే నష్టాలను అరికట్టాలన్నారు. ఒక పక్క ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతూఉంటే, ఇసుక అక్రమార్కులు మాత్రం కోట్లు గడిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోతే కలిసి వచ్చే అందరిని కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామన్నారు.

# శిథిలమైన గురుకుల భవనం..!

**-గురుకుల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు**









**ప్రజాపక్షం/ఖమ్మం :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి తలమానికంగా ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రస్తుతం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుంది. దానిలో భాగంగా గురుకులం ప్రారంభంలో నిర్మించినటువంటి డార్మెంటరీలు నిర్మాణ మన్నిక కాలం చెల్లడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పటికప్పుడు వాటిని తొలగించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సఫలం కావడం లేదు ఈ విధంగా ఉండటం వలన శిథిలాలలోకి విస సర్పాలు చేరుకొని విద్యార్థులకు హానీ కరంగా మారాయి. ఎన్నో లక్షల రూపాయల ఖర్చు పెట్టి విద్యార్థులకు స్నానాలు గదలు టాయిలెట్స్ గదులను నిర్మించినప్పటికీ ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురి అవుతున్నాయి. ఎంత ఖర్చు పెట్టిన వాటిని నిరుపయోగంగా ఉంచుతున్నారు. ప్రభుత్వం ఎన్నో లక్షలు వెచ్చించి విద్యార్థులకు నిద్రించడానికి బెడ్స్ సౌకర్యాలను అందించినప్పటికీ గురుకుల అధికారుల నిర్లక్ష్యంతో శిథిలాల మధ్య చిక్కుకుపోయాయి. వీటి ద్వారా లక్షల రూపాయల ధనం పాత డార్మెటరీలకు ప్రత్యామ్నాయంగా కొత్త డార్మెంటరీ నిర్మించినప్పటికీ, విద్యార్థులు నేలపై నిద్రించాల్సి వస్తుంది. అదే విధంగా విద్యార్థులు కాలకృత్యాలను ఆరుబయట చేసుకోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మౌలిక వసతులు ఏర్పాటు ఉపయోగ అంశాలపై అధికారులు ఎప్పటికప్పుడు అశ్రద్ధ చూపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి అయినా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా శిథిలావస్థకు చేరుకొనటువంటి భవనాలను తొలగించి పాఠశాల ఆవరణల్ని సుందరీకరించాలని ప్రత్యేక మైన ఏర్పాట్లతో మౌలిక వసతులను ఏర్పాటు చేయించాలని, విద్యార్థులు నిద్రంచేందుకు బెడ్లను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను కోరుకుంటున్నారు.

## విద్యుత్ శాఖ నిర్లక్షంతో

# ప్రజల ప్రాణాలు గాల్లోకి...!

**-ప్రైవేట్ వ్యక్తులచే పనులు నిర్వహణ**

**-పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు**

**-చోద్యం చూస్తున్న విద్యుత్ సిబ్బంది**



(ఫైల్)



(ఫైల్)

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రభుత్వం నుండి జీతాలు అందుకుంటున్న విద్యుత్ శాఖ సిబ్బంది అనుభవం లేని కార్మికులను తమ కింద హెల్పర్లు గా నియమించుకొని పనులు చేపిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో పశువులను మేపటానికి వెళ్లిన మహిళ విద్యుత్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పొలాల్లో విద్యుత్ తీగలు ఊయలలుగా వేలాడుతూ మరణ మృదంగాలను వాయిస్తున్నాయి. విద్యుత్ తీగలు భూమికి అడుగు దూరంలో వేలాడుతూ కనిపిస్తున్న వాటిని సరి చేయాల్సిన విద్యుత్ శాఖ సిబ్బంది ఆ వైపుగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరిగి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి. కిష్టాపురం గ్రామానికి చెందిన బేబీ (25) అనే అవివాహిత మూగజీవాల కడుపు నింపడానికి తీసుకువెళ్లి, తాను తిరిగిరాని లోకాలకు చేరుకుంది. బేబీ మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే అంటూ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లైన్మెన్ పుల్లారావు, అసిస్టెంట్ లైన్మెన్ ఖాసింలు ఫీల్డ్ లో తిరిగి విద్యుత్ లైను ఎప్పటికప్పుడు సరిచూసుకున్నట్లయితే అమాయకురాలైన మహిళ మృతి చెంది ఉండేది కాదని గ్రామస్తులంటున్నారు. ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటున్న సిబ్బంది తమకింద అనుభవం లేని కార్మికులను అరకొర జీతాలకు నియమించుకొని పనులు చేపిస్తుండటంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, గతంలో మూగజీవాలు బలయ్యేవని, నేడు మనుషుల ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేసవికాలంలో ఈదురు గాలులు తో కూడిన వర్షాలు పడడమే కాకుండా పిడుగులు సైతం పడుతుంటాయని, ఆ సమయంలో విద్యుత్ లైన్లకు అంతరాయం కలుగుతుందనేది చిన్నపిల్ల వాళ్లని అడిగినా చెప్తుంటారు. అటువంటిది ఎంతో అనుభవం ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది గత రెండు రోజులుగా భారీ ఉరుములతో కూడిన వర్షాలు పడినా ఎందుకు ప్రమాదాన్ని గుర్తించలేదనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. సుమారు 12 అడుగుల ఎత్తులో ఉన్న విద్యుత్ లైను కిందకు జారిన గ్రహించలేని స్థితిలో విద్యుత్ సిబ్బంది ఉన్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తక్షణమే మహిళా మృతికి కారకులైన విద్యుత్ సిబ్బందిపై వేటువేసి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### మహిళా మృతిపై ఏఈ కావ్య వివరణ కోరగా...

విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, రెండు మూడు రోజుల క్రితం వచ్చిన ఉరుములకి ఇన్సులేటర్ పగిలి విద్యుత్ లైను కిందకి వచ్చి ఉంటుందని, లైన్ ట్రిప్ కాకపోవడంతో ఎవరు గుర్తించలేదని సమాధానం చెప్పటం విశేషం.. ఇదే సందర్భంలో రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రైవేటు వ్యక్తిని పనికి పెట్టుకుని లైను మరమ్మత్తులు చేపిస్తుండగా గ్రామంలో ఓ వ్యక్తి వీడియో తీయడం విశేషం. రెండు నెలల క్రితం చౌడవరం గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ కార్మికుడు ఓ రైతు పొలంలో పనిచేస్తుండగా ప్రమాదం జరిగి, మృత్యువు అంచుల వరకు వెళ్లి వచ్చాడు. ఆ సమయంలో సైతం రైతుని బలి పశువుగా చేసిన విద్యుత్ సిబ్బంది, తమకేమీ తెలియదన్నట్లు చేతులు దులుపుకున్నారు. గ్రామంలో ఏ ఒక్కరిని అడిగిన అక్కడ లైన్మెన్ కింద పని చేస్తున్నాడని చెప్తుండడం విశేషం. ఇప్పటికైనా జిల్లా విద్యుత్ శాఖ అధికారులు కిందిస్థాయి సిబ్బంది చేస్తున్న విధులపై ఓ కన్నేసి పటిష్ట చర్యలు చేపట్టకపోతే మరికొన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ప్రజల ప్రాణాలను తీస్తున్న నిర్లక్ష్యపు విద్యుత్ సిబ్బంది పై చర్యలు తీసుకొని, వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## జాతీయ కబడ్డీ పోటీలకు లోకేష్ రామ్ చరణ్ ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం:** కామేపల్లి మం డలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన ఈసం లోకేష్ రామ్ చరణ్ మహా రాష్ట్రం లో డియోలో జిల్లా విదర్భ ప్రాంతంలో 51వ అండర్ 20 జూనియర్ జాతీయ స్థాయి కబడ్డి పోటీలలో పాల్గొననున్నా రు. అమెచ్చుర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించు జాతీయ పోటీల్లో తెలంగాణ జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోకేష్ రామ్ చరణ్ ఎంపిక పట్ల ఖమ్మం జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి బండ్ల రాంబాబు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. సీటీడబ్ల్యూఆర్‌జెసి గుండాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో బైపిసి పూర్తి చేసుకున్న ఈ క్రీడాకారుడు పట్ల ఆ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకుల బృందం, ఫిజికల్ డైరెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

## బడి బాటను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండలంలో బడి బాట కార్యక్రమం నేటి శుక్రవారం నుండి నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు అన్నారు. ఈ బడి బాటలో పిఎస్, యూపిఎస్, జెపిహెచ్ఎస్ హెచ్ఎంలు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్‌లు ప్రముఖులు, విద్యా వేత్తలు, గ్రామ ప్రజలు, ఎస్‌హెచ్‌జి సభ్యులతో ప్రతి గ్రామ కూడలిలో తప్పని సరిగా పీటీఎం నిర్వహించాలని తెలిపారు. ఉదయం లేదా సాయంత్రం వేళలలో గ్రామస్తులు ఎక్కువగా అందుబాటులో ఉండే సమయంలో పీటీఎం నిర్వహించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలను తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి ఆయా గ్రామ కూడలిలో నిర్వహించే పీటీఎంలో కనీసం ఒక టీచర్ లేదా టీచర్ అందుబాటులో లేనప్పుడు ఒక సీఆర్‌పి నిర్వహించాలన్నారు. యూపిఎస్, హై స్కూల్ విషయంలో సంబంధిత పీఎస్ హెచ్ ఎంలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విద్యా ప్రణాళికలను వివరించి విస్తృత ప్రచారం చేయాలన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తాళ్లపాయి మాజీ సర్పంచ్ బైటి రాజేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నిరు పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఎంపికలో ప్రభుత్వ అధికారులు వైఫల్యం చెందారని, ఇక్కడ ఏం జరుగుతుంది అంటే కొంత మంది తల్లిదండ్రుల పేర్లు మీద సుమారుగా ఆరు నుండి పది ఎకరాల వరకు కూడా పట్టా భూమి కలిగి ఉన్నారని, కానీ వారి కొడులకు ఇందిరమ్మ ఇల్లులు కేటాయిస్తున్నారని వారు నిరుపేదలు ఎలా అవుతారని ఆరోపించారు. తల్లిదండ్రులకు భూమి ఉన్నట్లయితే కొడుకులకి కూడా ఉన్నట్లే కదా ప్రభుత్వ అధికారులు ఆలోచన చేయాలన్నారు. నిరుపేదకలు భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ సర్వేలో అన్యాయం జరిగిందని, మరల రీ సర్వే చేసి నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు. మీ ఉద్యోగానికి మీరు న్యాయం చేయాలని అంతే కానీ ఇందిరమ్మ గ్రామ కమిటీ వారు చెప్పిందే మేం చేస్తామంటే కుదరదన్నారు. నిజమైన పేదవాళ్లకు న్యాయం జరగకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

## నేటి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/కారేపల్లి :** నేటి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ దిశా కమిటీ సభ్యులు లకావత్ లక్ష్మ ణ్ నాయక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహా విష్కరణ కార్యక్రమానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారని, అనంతరం మిట్టపల్లిలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి సింగరేణి మండలం నుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## గుండ్ల రేవు యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/ఖమ్మం :** గుండ్ల రేవు యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ. 20,000 /, ద్వితీయ బహుమతి రూ. 15,000/ గా నిర్ణయించబడిందని, ఎంట్రీ ఫీజు రూ. 2,000/లు అని, మొదటి 16 టీములకే ఎంట్రీ ఫీజు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు చెల్లించుటకు చివరి తేదీ ఈ నెల 10వ తేదీ అని, గుండ్ల రేవు లో ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆశక్తి గల క్రీడాకారులు జి. శివ (99598854432), బి. నాను, (90149954983) బి. నరసింహ (86396348704), బి. వెంకటేశ్వర్లు (9963659335) లను సంప్రదించాలని వారు కోరారు.

# ఆళ్లపల్లి పంచాయతీకి నాలుగు ఇల్లులే కేటాయింపు

**-అధికారులు తప్పుడు సర్వే చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆళ్లపల్లి పంచాయితీకి ఇందిరమ్మ ఇల్లు కేవలం నాలుగు మాత్రమే కేటాయించారు. ఈ పంచాయితీలో సుమారు 3000 జనాభా, 1900 ఓటర్లు సుమారు 1000లోపు ఇల్లు ఉన్నాయి. కానీ ఇందిరమ్మ ఇల్లులు మాత్రం కేవలం నాలుగు మాత్రమే కేటాయించారు. అర్హులు లేరా అని కాదు అర్హులను అధికారులు తప్పుడు సర్వేతో ఎల్ వన్‌లో చూపించలేకపోయారు. ఎల్ వన్ అంటే ఇల్లు లేకుండా కట్టుకోవడానికి ఖాళీ స్థలం ఉండాలి. అలా ఉన్న వాళ్లు చాలా మంది ఉన్నారు. కానీ డేటా ఎంటర్ చేసే టైంలో ఏమైందో తెలియదు కానీ ఇల్లు లేకుండా ఖాళీ జాగా ఉన్న వాళ్లు చాలా మంది ఉన్నా వాళ్లందరూ కాలి జాగలేదని ఎల్ టూలోకి మార్చారు. దీంతో ఆ రోజు గ్రామ సభలో గొడవ జరిగింది. అధికారులు రీ సర్వే చేస్తామని ఒప్పుకున్నారు. మొదట దఫాలో ఎల్ వన్‌లో 36, ఎల్ టూలో 311, ఎల్ త్రీలో 15 చూపించారు. మళ్లీ ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఎల్ వన్‌లోకి మార్చి పంపించారు. అంతా బాగానే ఉన్నా, చివరకు ఇందిరమ్మ ఇల్లు పైన లిస్ట్ వచ్చే సరికి కేవలం మొదటి సారి ప్రకటించిన ఎల్‌వన్ లిస్టు ఆధారంగా కేటాయించారు. దీనితో ఆళ్లపల్లి మండల హెడ్ క్వాటర్ పంచాయితీకి కేవలం 4 ఇల్లులు మాత్రమే వచ్చాయి. ఈ నాలుగు ఇండ్లు కూడా మొదటి దఫా ఎల్‌వన్‌లో ఉన్నా వారు కాదు, ఎల్‌టూలో వాళ్లని సెలెక్ట్ చేశారు. కోటా ఏమో ఎల్‌వన్ ఆధారంగా కేటాయిస్తారు అంట, సెలెక్ట్ ఏమో అన్ని దాంట్లో నుండి తీసుకుంటారంట. ఇది కూడా విచిత్రంగా ఉంది. దీనితో ఆళ్లపల్లి పంచాయితీ ప్రజలు అధికారులు చేసిన తప్పిదాలకు మేము మోసపోయామని ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గుర్తించి మాకు వచ్చే కోటాని మాకు కేటాయించాలని వేడుకుంటున్నారు. అలాగే తప్పుడు సర్వే నిర్వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చదువుకున్న వాళ్లే తప్పు చేస్తే మాలాంటి నిరక్షరాశుల పరిస్థితి ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటి నుండో ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురు చూస్తుంటే తీరా అధికారులు తప్పిదాలతో మాకు ఇల్లు రాకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మిర్చి బస్తాలకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల పరిధిలోని బోటిగూడెం పంచాయితీ పరిధిలోని సీతంపేట గ్రామంలో గురువారం తెల్లవారుజామున గుడిసెలో ఉన్న 25మిర్చి బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రెండున్నర ఎకరాల మిర్చి పంట గుండారపు మల్లయ్య అనే రైతుకు చెందినదిగా గుర్తించారు. పంటతో పాటు పక్కనే ఉన్న పైప్ లైన్‌కి సైతం నిప్పు అంటించారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కేసు విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తోటి హమాలీ కార్మికుడికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల పరిధిలోని ఏదూళ్లబయ్యారం హమాలీ సంఘ కార్మికుడిగా పని చేస్తున్న ప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. ఈ క్రమంతో తోటి కార్మికులు వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం 26వేల ఆర్థిక సాయం అందజేశారు. తమ కార్మిక సంఘ నిబంధనల మేరకు ప్రమాదవశాత్తు గాయపడిన వారికి తమ వంతు సహాయంగా కార్మికులందరూ కలిసి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించినట్లుగా తోటి కార్మికులు తెలిపారు.

# ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోండి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఒప్పంద ఉద్యోగాలకు అర్హతగల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంపుపథకానికి ఒప్పంద పద్ధతిలో మేనేజర్, సహాయ మేనేజర్ పోస్టులు భర్తీ చేస్తారని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 10వ తేదీలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎంఐఎంఎస్ఎంఇ.గవ్.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పరిశ్రమల శాఖ జిఎం తిరుపతయ్యను కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# యాదవుల అభివృద్ధే యాదవ విద్యావంతుల వేదిక లక్ష్యం



**ప్రజాపక్షం/ఖమ్మం:** యాదవులు విద్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించాలన్నది తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక ప్రధాన లక్ష్యమని తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. గురువారం లక్ష్య టాలెంట్ స్కూల్ లో విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు చెక్కిలాల మోహన్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విద్యావంతుల అవగాహన తరగతులలో ముఖ్య అతిథిగా చలకాని వెంకట్ మాట్లాడుతూ యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని, అన్ని రంగాలలో యాదవులు ముందు ఉండాలన్నారు. నిరుపేద యాదవ విద్యార్థుల చదువు కోసం కూడా సంఘం ఆధ్వర్యంలో ఆర్థికంగా సహాయం చేయాలన్నారు. ఓట్లు మావి.. సీట్లు మీవా.. అనే నినాదంతో మన జనాభా ప్రకారం మనకు వాటా వచ్చేలా డిమాండ్ చేయాలన్నారు. చెక్కిలాల మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అప్పుడే అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగా సీతారాములు యాదవ్ మాట్లాడుతూ యాదవ్ జాతి మొత్తం కూడా ఐక్యంగా ఉండాలని సమాజంలో మంచి గుర్తింపు పొందాలని, యాదవుల కోసం తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్, పసల శ్రీనివాసరావు, కట్టబోయిన మోహన్ రావు, కర్రి కుటుంబరావు, గుమ్మ రోశయ్య యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఇందుమతి యాదవ్, గోస్ వీరభద్రరావు, కొప్పుల రంగారావు,కర్రీ వెంకటేశ్వర్లు, కొప్పుల గోవిందరావు, గాయం తిరుపతిరావు, గోపి, వర్ధనబోయిన నాగేశ్వరరావు, లక్ష్య టాలెంట్ స్కూల్ అధినేత పాలగాని ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఈసం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆదిలాబాద్ జిల్లాలోని కొమరంభీం యుద్ధ భూమి జోడేఘాట్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలు మూడు రోజులు జరిగాయని, అనంతరం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఈసం నర్సింహారావును ఎన్నుకున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజులపాటు జరిగిన రాష్ట్ర మహాసభలో మొదటి రోజున ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం ప్రారంభించారని, రెండో రోజు కేంద్ర విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఆచార్యులు శ్రీనివాసరావు, మూడో రోజు రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. ఈ పదవితో తనకు బాధ్యత పెరిగిందని, రాష్ట్ర స్థాయిలో ఆదివాసీ సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఆదివాసీ చట్టాలను, హక్కులను కాపాడుతూ జీఓ నం.3రూపంలో మరో చట్టం రావాలని పోరాటం, 1/70చట్టం కాపాడే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

# టెర్రరిస్టు నిర్మూలనకు భారత్ బాటలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత్‌పై పాకిస్తాన్ పైశాచిక దాడులను నిరసిస్తూ గురువారం నాడు చుంచుపల్లి సిపిఐ పార్టీ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, దుర్గారాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్ లు మాట్లాడుతూ, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమని అన్నారు. సర్వ మత కులాల నిలయంగా భారతదేశం విలసిల్లుతుందని వారు చెప్పారు. టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ పెహల్గాం లోని పర్యాటక కేంద్రాలలో సందర్శనకు వెళ్లిన భారతీయులను పాకిస్తాన్ టెర్రరిస్టులు కాల్చి చంపడం మానుషమైన చర్యని అన్నారు. ప్రపంచ మానవ వానికి ప్రమాదకరమైన టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ప్రమాదకరమైన దేశంగా ఉందన్నారు. భారత మిలటరీ, దేశ పౌరుల శక్తి సామర్థ్యాల ముందు పాకిస్తాన్ బలాదూరని చెప్పారు. పాకిస్తాన్లోని టెర్రరిస్ట్ స్థావరాలపై భారత మిలటరీ చేసిన దాడులు న్యాయపరమైనవి చెప్పారు. పాకిస్తాన్ తో యుద్ధం చేయవలసిన అవసరం వస్తే సిపిఐ పార్టీ భారతదేశ ప్రభుత్వానికి రక్షణ శాఖకు తమ శక్తివంచన కృషిచేసి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పసాగారు. ఈ కార్యక్రమంలో, వీరస్వామి, గుండు శ్రీనివాస్ జనార్ధన్, ఉమామహేశ్వరరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, రాంజీ,తోటరాజు, చావా శ్రీనివాస్, రవి కిరణ్, రంగా, తదితరులు పాల్గొన్నారు.

# కక్షిదారులకు మజ్జిక ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం ఇల్లెందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కక్షిదారులకు మజ్జిక పంపిణీ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మజ్జిక ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ..కక్షిదారుల కోసం ఇల్లెందు బార్ అసోసియేషన్ ఇలాంటి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సుదూర ప్రాంతాల నుంచి కోర్టుకు వచ్చే కక్షిదారులకు గతనెలలో చలివేంద్రం సైతం ఏర్పాటు చేశారని, వయోవృద్ధులు, పిల్లలు అలసటకు గురవకుండా మజ్జిగ ప్యాకెట్లు పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బేతేస్తాలో విబిఎస్ సంబరాలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్‌లోని బేతేస్తా ప్రార్థనా మందిరములో పాస్టర్ కృపాకర్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుండి విరామ బైబిల్ స్కూల్ తరగతులు నిర్వహించబడ్డాయి. ప్రతి రోజు సుమారు రెండు వందలకు పైగా చిన్నారులతో పలు సంస్కృతిక కార్యక్రమాలు, దైవిక జ్ఞానం పెంపొందించే బోధనలు, మానసిక ఉత్తేజాన్ని పెంపొందించే స్కిట్లుతో చిన్నారులు అలరించారు. ఈ నాలుగు రోజులు చిన్నారులతో బేతేస్తా ప్రార్థన మందిరంలో సంబరాలు ఘనంగా జరిగాయి. జరిగిన నాలుగు రోజులు సుమారు 200పైనా చిన్నారులకు స్నాక్స్, జ్యూసులు, భోజనా సదుపాయాలు అందించి, చిన్నారులకు ఎటువంటి లోటు లేకుండా దగ్గరుండి అన్ని సదుపాయాలు పాస్టర్ కృపాకర్ అండ్ టీం దగ్గరుండి చూసుకున్నారు. చివరి రోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులకు సర్టిఫికెట్స్, గిఫ్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవంతంగా జరగడానికి టీచర్స్‌గా మెర్సీ, రంజిత, శిల్ప, హెలెన్, రత్న శ్రీ, దీపా ఫ్లారెన్స్‌కు పాస్టర్ కృపాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతపురి సతీష్, గొల్లపల్లి నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లెందు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం :** సింగరేణి సంస్థ డైరెక్టర్(ప్రాజెక్టు, ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు గురువారం ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం, జేకే5ఉపరితల గనుల్లో పర్యటించారు. పనిస్థలాలకు వెళ్లి పనులు పరిశీలించి, రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను ఏరియా జీఎం వి.కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్యటించిన డైరెక్టర్(ప్రాజెక్టు, ప్లానింగ్) మాట్లాడుతూ..ఎటువంటి ఆటంకాలు లేకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా, రోజువారీ లక్ష్యాలను అధికమించాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి, ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉద్యోగులకు రక్షణపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఓకేటీసీ గోవిందరావు, జేకే పీఓ ఎ.కృష్ణమోహన్‌రావు, డీజీఎం సివిల్ రవికుమార్, మేనేజర్ పూర్ణచందర్, పి.శ్రీనివాస్, పి.ఇ.శివశంకర్,నాణ్యత మేనేజర్ కె.రాందాస్, సర్వే అధికారి నాగేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, సీనియర్ పీఓ వి.అజయ్ తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలను అందించండి

**-ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన భట్టి, దామోదర రాజనర్సింహ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కోరారు. గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రిసెప్షన్, హెల్ప్ డెస్క్, ఓల్డైజ్ క్లినిక్, ఫార్మా విభాగం, ఫిమెల్ వార్డు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల విషయమై ఏర్పాటు చేసిన బోర్డును పరిశీలించారు. ఎమర్జెన్సీ మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవుట్ పేషంట్ల సంఖ్య ఏఏ రకాల వ్యాధిగ్రస్తులు ఆసుపత్రికి వస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవల కోసం వస్తున్న వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మంత్రుల వెంట వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తదితరులు ఉన్నారు.

## ఐదు కేజీల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/ఖమ్మం :** విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని స్థానిక పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం అశ్వారావుపేట పోలీసులు భద్రాచలం రోడ్డులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఊట్లపల్లి నుండి అశ్వారావుపేట వైపుకు వెళ్తున్న మూడు బైకులపై వెళ్తున్న 7గురు అనుమానితులను పట్టుకుని వారి వద్ద నుండి సుమారు ఐదున్నర కేజిల గంజాయిని పట్టుకుని, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు రిమాండ్‌కు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉరేసుకుని యువతి ఆత్మహత్య



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉరేసుకుని యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మసీదు రోడ్డులో గల ఓ ఇంట్లోని బాత్రూంలో యువతి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు సమాచారం అందటంతో పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని, కళ్యాణి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మృతురాలు పెనుబల్లి మండలం, బ్రహ్మలకుంట గ్రామానికి చెందిన భుక్యా కళ్యాణి (20) తండ్రి భుక్యా గాంధీ అని, సత్తుపల్లి పట్టణంలోని కిడ్స్ కేర్ ఆసుపత్రిలో పని చేస్తుందని, మృతికి గల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. తండ్రి గాంధీ ఫిర్యాదు మేరకు ఎస్.ఐ కవిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నేటితో ఇందిరమ్మ ఇళ్ల క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తి



**ప్రజాపక్షం/ఖమ్మం :** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు, సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల పరిధిలో ఇందిరమ్మ గృహాలు 3500 మంజూరైనట్లు వాటిలో అర్హుల జాబితా శుక్రవారం కల్లా పూర్తవుతుందని ఆర్డిఓ రాజేంద్ర తెలిపారు. మండలాల పరిధిలోని ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, పరిశీలన అధికారులు, ప్రత్యేక శ్రద్ధతో క్షేత్రస్థాయిలో అర్హుల జాబితా ను బట్టి క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలించి గుర్తిస్తున్నారు. ఎంపికలో పారదర్శకతను పాటిస్తున్నట్లు ఆర్డిఓ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లా పూర్తి చేసి తమ కార్యాలయంలో అందించాలని ఆయన పేర్కొన్నారు. నిజమైన అర్హులకే గృహాలు అందిస్తామని పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో గృహాలు వారు ఇప్పటికే కొన్ని ముగ్గులు పోశారని, మరి కొన్ని పునాదులు ప్రారంభించారని ఆయన వివరించారు. అర్హుల జాబితాను బట్టి మూడు విభాగాలుగా అర్హులకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హుల జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరు కి గృహాలు అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## నూతన వధువరులను ఆశ్వీరదించిన మంత్రి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలం లోని పలు గ్రామాలలో గురువారం పర్యటించారు. ఆచార్లగూడెం, బోదులబండ గ్రామాలకు చెందిన నూతన వధువరులను ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ఊరు వెళ్తున్నారా.. జర భద్రం..!



**ప్రజాపక్షం/ఖమ్మం :** వేసవి సెలవుల్లో ఇళ్ళకు తాళాలు వేసి విహార యాత్రలకు, పెళ్లిళ్లకు, బంధువుల ఇళ్లకు వెళుతున్నారా అయితే దొంగలుంటారు జాగ్రత్త అని, కనీస జాగ్రత్త చర్యలు తీసుకొని ఊరెళ్లడం మంచిదని ఈ బయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు. సెలవుల్లో యాత్రలు, సొంత గ్రామాలకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను నివారించవచ్చన్నారు. వేసవి సెలవుల్లో ఇంటికి తాళం వేసి ఊరెళ్లే ఇళ్లనే దొంగలు లక్ష్యం చేసుకొనే ప్రమాదం ఉందని, తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు తెగబడి దోచుకు వెళ్లిన సంఘటనలు జరుగుతున్నాయన్నారు. విహార యాత్రలకు, పెళ్లిళ్లకు, ఊరికి వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి వెళ్తే ఇంటి పరిసర ప్రాంతాల్లో నిఘా పెట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేస్తున్నామన్నారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను మాత్రమే ఎంచుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుందని కావున ఇంటి యజమానులు వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ విధిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అందుకే విహార యాత్రలకు, ఊరికి వెళ్లేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించాలని ఇంటి తాళం వేసి వెళ్లే సమయంలో పక్కింటి వారితో పాటు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విలువైన ఆభరణాలు ఉంటే తమ వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. రాత్రి సమయాల్లో గ్రామాల్లోకి వచ్చే అనుమానిత వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అత్యవసన సమయంలో 100 లేదా పోలీస్ స్టేషన్ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. మీరు ప్రయాణించే వివరాలను ఫేస్ బుక్, వాట్సాప్‌లలో పోస్ట్ చేయడం ద్వారా దొంగలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని తెలిపారు. నేరాలను అదుపు చేయడానికి పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## జాలరీకి చిక్కిన వింతైన చేప..!



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి ఏటిలో జాలరి కి వింతైన చేప చిక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉపేందర్ అనే జాలరి రోజు మాదిరిగానే స్థానిక ఏటి లో చేపల కోసం వలను విసరగా... అందులో అరుదైన చేప చిక్కింది. దెయ్యంబేరు అనే సముద్రం చేప చిక్కినట్లు మత్స్యకారుడు తెలిపారు. అరుదైన చేప ను స్థానికులు పెద్ద సంఖ్యలో తిలకించారు.

## నూతన వధువును ఆశీర్వదించిన జైపాల్



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో పరుచూరి గార్డెన్‌లో జరిగిన తాళ్లూరి శ్రీను, పద్మ దంపతుల కుమార్తె పావని ప్రధాన వేడుకలో పాల్గొన్న వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ నూతన వధువు పావనిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్, ఏదునూరి శ్రీను(బుజ్జి), గడసందుల నాగరాజు, రేగళ్ల సైదులు, వడ్లమాని సైదులు, వేముల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ముగూడెంలో బడిబాట




**ప్రజాపక్షం/వైరా:** దుమ్ముగూడెం లక్ష్మీ నగరం గ్రామంలో నూతనంగా ప్రారంభించబడిన ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థుల సంఖ్యను (ఎన్‌రోల్మెంట్) పెంచడం కొరకు ఉపాధ్యాయుడు బొడ్డు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ యువత పెద్దల సహకారంతో బడిబాట ప్రారంభించడం జరిగింది. ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఎంపిపి ఎస్.లక్ష్మీ నగరం పాఠశాల నందు చేరుటకు ఆసక్తి కనబరచడం సంతోషంగా ఉందని అన్నారు. ఆ విద్యార్థులకు ఉచిత విద్య ఉచిత యూనిఫామ్ ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోట్ బుక్స్, రాగిజావ, రుచికరమైన మధ్యాహ్న భోజనం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి లేని సహజ సిద్ధమైన విద్యా బోధనలతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి మేము కృషి చేస్తామని తెలిపారు. కావున విద్యార్థుల తల్లి దండ్రులు ప్రభుత్వం అందించే పథకాలే కాకుండా ప్రభుత్వం అందించే విధంగా కూడా పిల్లలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ బడిబాట కార్యక్రమంలో వీరేందర్, వెంకట్, అక్బర్, మస్తాన్, వీర్రాజు, తాతారావు, చింటు తదితరులు పాల్గొన్నారు.

## వైరా గ్రేట్ విజన్ క్లబ్ నూతన కార్యవర్గం



**ప్రజాపక్షం/వైరా:** గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో 2025–26 లయన్సిక్ ఇయర్‌కు గాను నూతన ప్రెసిడెంట్ జాలా పుల్లారావు, వైస్ ప్రెసిడెంట్‌గా జాలా మహాలక్ష్మి, సెక్రటరీ గంగవరపు కిషన్, ట్రెజరర్ వుయ్యూరు రామకృష్ణ, జిఎంటి కోఆర్డినేటర్ కట్టా శేషక్,జిఎస్‌టి కోఆర్డినేటర్ మచ్చా రామారావు, జీఈటి కోఆర్డినేటర్ యలమద్ది శ్రీను, పిఆర్‌వోగా కోర్లకుంట నాగేశ్వరరావుగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవరర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జిఎస్‌టి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, జెడ్‌సి వుంద్రు వరలక్ష్మి, జెడ్‌సి(ఈ) చింతోజు నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు అభినందించారు.

# సైన్యం చూపిన ధైర్యం దేశానికి గర్వకారణం




**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్**
**-ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా సంఘీభావ ర్యాలీ**




**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి భారత సైన్యం చూపిన ధైర్యం దేశానికే గర్వకారణమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. టిపిసిసి ఆదేశానుసారం గురువారం నగరంలో భారత ఆర్మీకి మద్దతుగా సంజీవరెడ్డి భవన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు శాంతియుత సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్‌లో దాగిన ఉగ్రమూకలపై రుద్రతాండవమాడి సింధూర్ ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించి సుమారు 80 మంది ఉగ్రవాదులను హతమార్చిందని ఆయన తెలిపారు. పాక్‌లోని ఉగ్రవాద సంస్థలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు యావత్ దేశ ప్రజలు గర్వపడేలా చేశాయని ఆయన తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రతి భారతీయ పౌరుడు భారత సైన్యానికి అండగా నిలవాలన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ప్రతి సైనికునిగా ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వర్లు, చోటాబాబా, సాధు రమేష్‌రెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, సాయి, మొక్కా శేఖర్ గౌడ్, కార్పొరేటర్లు , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యను దర్శించుకున్న పొంగులేటి దంపతులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయాన్ని రాష్ట్రరెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయమర్యాదల ప్రకారం అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. వారి పెళ్లిరోజు కావడంతో గర్భగుడిలోప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ప్రాంగణంలోని లక్ష్మీ తాయారామ్మ వారి ఆలయంలో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు తంపతులు, ఆర్డిఓ దామోదర్ రావు, ఆలయం ఇఓ ఎల్ రమాదేవి పలువురు పాల్గొన్నారు.

# నీటి వనరుల సంరక్షణ భావితరాలకు శ్రీరామరక్ష




**ప్రజాపక్షం/ఖమ్మం :** నీటి వనరుల సంరక్షణ భావితరాలకు శ్రీరామ రక్ష అని, అవకాశం ఉన్న ప్రతీ చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. గురువారం ఎస్‌బిఐ రుద్రంపూర్ బ్రాంచ్ ఆవరణలో ఇంకుడు గుంత తవ్వారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూ గర్భ జలాల పరిరక్షణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఈశ్వర్ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ రాములు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు పున్నం చందర్, రాంబాబులు తెలిపారు. గురువారం పెద్దబీరవల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో తహసీల్దార్లు మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రతా భావాన్ని పోగొట్టడంతో పాటు జవాబుదారితనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, నిషేధిత భూములు, మార్పులు, చేర్పులు వంటివి సులభమవుతాయని తెలిపారు. రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తామన్నారు. బోనకల్, పెద్దబీరవల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా పెద్దబీరవల్లిలో 200, బోనకల్‌లో 58 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు నవీన్, మైథిలి తదితరులు పాల్గొన్నారు.

# తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయండి




**-రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదు : పోతినేని**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. రకరకాల సాకులు చూపి తరుగు తీస్తున్నారని ఇది సరికాదని ఆయన తెలిపారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం కార్యదర్శి వర్గ సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా జాప్యం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ధాన్యం తరలింపుకు గోనే సంచిలు లేవని లారీల కొరత, కాంటాలు జరగకపోవడం రైతులకు శాపంగా మారిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాచర్ల భారతి, బొంతు రాంబాబు, వై. విక్రం, వీరభద్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీను పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష రాసిన వారు పోర్టల్‌లో నమోదు కావాలి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు యు డిఐఎస్ఇ ప్లస్ పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఐడిఓసిలో ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో కూడా డిజిటల్ ఎడ్యుకేషన్, ఫేషియల్ అటెండెట్స్ ప్రవేశపెట్టేలా చూడాలన్నారు. ఇంటర్ కళాశాలల్లో అతిపెద్ద మైదానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతల నిర్మాణాలు జరగడం లేదని, వెంటనే అన్ని శాఖల్లో ఎకరాకు ఐదు ఇంకుడు గుంతలు నిర్మించాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిలాల్ విద్యాధికారి వెంకటేశ్వరాచారి, కో ఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి సుముఖంగా లేని లబ్ధిదారులు

**- ఆర్థికంగా ఉన్న గ్రామాన్ని**
**పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన వైనం**
**- ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని**
**ప్రాధేయపడుతున్న అధికారులు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంతో విడతలవారీగా ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా తిరుమలాయపాలెం మండలానికి 729 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా పైలెట్ ప్రాజెక్టు కింద ఏలూవారిగూడెం గ్రామానికి మరో 39 ఇండ్లను మంజూరు చేసింది. దానిలో మొదట విడతగా 14 ఇండ్లను నిర్మించాలని అధికారులకు సూచనలు ఇవ్వగా 7గురు లబ్ధిదారులు ప్రారంభించారు. మిగితా 7గురు ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఇండ్లను నిర్మించడానికి సుముఖంగా లేరు. పైలెట్ ప్రాజెక్టు కింద అన్ని విధాల ఆర్థికంగా ఇండ్లు ఉన్న గ్రామాన్ని ఎంపిక చేయడం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి వివిధ కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో చిన్న గ్రామపంచాయతీలు జోగులపాడు, తిమ్మక్కపేట, పడమటి తండా, రుమణా తండా, అజ్మీర తండా, శివారురాకాసి తండా, మంగళిబండ తండా, ఏనుకుంట తండాతో పాటు శివారు గ్రామాలు ఉన్నాయి. కాని అన్ని విధాలుగా ఆర్థికంగా ఉన్న గ్రామాన్ని ఎంపిక చేయటం ఇందిరమ్మ కమిటీలు భూములు, ట్రాక్టర్లు వాహనాలు ఉన్న పేర్లను సూచించడంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు సుముఖంగా లేరు. గత ప్రభుత్వం ఇదే గ్రామంలో 23మందికి దళితబంధు మంజూరు చేసింది. అవిధంగానే ఇందిరమ్మ ఇండ్లను కూడా ఈ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు భావిస్తున్నారు. మంజూరైన లబ్ధిదారుల చుట్టూ అధికారులు తిరుగుతూ ఇండ్లు నిర్మించుకోవాలని ప్రాధేయపడుతున్నా వారు ఇండ్లు నిర్మించుకోవడానికి సుముఖంగా లేరని తెలుస్తుంది. నిర్మాణాన్ని ప్రారంభించిన లబ్ధిదారు ఇండ్లకి ఇప్పటికీ రెంటల్ లెవల్‌కి నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రెంటల్ లెవెల్ ఇల్లు నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారుల అకౌంట్లో నగదు జమైనట్లు తెలిపారు.

# కొబ్బరి చెట్టుపై పిడుగు.. చెలరేగిన మంటలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** పట్టణంలో గురువారం సాయంత్రం స్థానిక రాజరాజేశ్వరి ఆలయం సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో పెద్ద ఎత్తన మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా వచ్చిన గాలిదుమారంతో ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ శబ్ధాలతో పిడుగులు పడ్డాయి. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం వాటిల్లింది.

# మే 10న టిజిఆర్‌జెసి సెట్ పరీక్షా కేంద్రాల వద్ద బిఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ అమలు

**-పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** మే 10న టిజిఆర్‌జెసి సెట్ నిర్వహించనున్న పరీక్షా కేంద్రాల సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 27 పరీక్షా కేంద్రాల సమీపంలో 163 బిఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని 200 మీటర్ల రేడియస్‌లో గల ఇంటర్ నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపులు మూసివేయాలని తెలిపారు. మే 10న ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు పరీక్షా కేంద్రాల సమీపంలో ఈ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడడానికి వీలు లేదని ఆదేశాలు ఎవరైనా అతిక్రమిస్తే ఈ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిపి ప్రకటనలో తెలిపారు.